క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం సురక్షితం


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మద్దికెర : ప్రభుత్వ వైద్యశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఇక్కడే ప్రసవాలు సురక్షితమని వైద్యాధికారి రాగిణి తెలిపారు. గురువారం స్థానిక వైద్యశాలలో గర్భిణులు, బాలింతలకు వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యశాలలో కాన్పులకు, గర్భిణులకు అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తున్నామని చెప్పారు. జరుగుతుందన్నారు. మహిళలు ప్రతినెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యులు సూచనల మేరకు జాగ్రత్తలు పాటిస్తే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ల్యాబ్ అసిస్టెంట్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన ఓటింగ్ శాతం

తుగ్గలి : మండలంలో గతంలో కంటే 0.06 శాతం ఓటింగ్ పెరిగింది. ఓటింగ్ పెరగడానికి కారణం ఇతర ప్రాంతాల్లో నివసించే వారు రావడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలేనని ప్రజలు భావిస్తున్నారు. 2019 సార్వత్రికల్లో 86.48 శాతం ఓటింగ్ జరిగింది. ఆ ఎన్నికల్లో 45,649 మంది ఓటర్లు ఉండగా 39,478 ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో 49,316 మంది ఓటర్లు ఉండగా 42,676 మంది ఓటేశారు. అందులో పురుషులు 21,666 మంది, స్త్రీలు 21,007, థర్డ్ జెండర్స్ ముగ్గురు ఓట్లు వేశారు. మొత్తం 86.54 శాతం ఓటింగ్ నమోదైంది.

పది 'సప్లిమెంటరీ' హాల్ టికెట్ల విడుదల

తుగ్గలి : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ప్రభుత్వం ఆన్‌లైన్‌లో విడుదల చేసిందని ఎంఈఓ–2 రామ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్ ద్వారా bre.ap.gov.in నుంచి హాల్ టికెట్లు పొందవచ్చన్నారు. ఇదే వెబ్‌సైట్ ద్వారా స్ట్రీమ్, జిల్లా, పాఠశాల, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని నమోదు చేసి నేరుగా హాల్ టికెట్లు పొందవచ్చని చెప్పారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎల్లార్తి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు


శేక్షావలి దర్గాలో స్వామివారి సమాధి

హొళగుంద: ఎల్లార్తిలో వెలసిన శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శనం చేసుకుని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిర్డీ సాయిబాబా ఆలయానికి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాద, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

ఆలయ భూముల కౌలుకు వేలం

ఆలూరు: పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆలయాల మాన్యం భూములను అక్రమంగా సాగుచేసినా, ఆక్రమించుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని డివిజన్ దేవాలయాల ఎగ్జిక్యూటివ్ అధికారి పీఎస్.రాధాకృష్ణ హెచ్చరించారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆలూరు మండలం మొలగవెల్లి గ్రామంలోని శ్రీ చెన్నకేశవ, భోగేశ్వర, నాగలింగేశ్వర, చౌడేశ్వర, గణేష్, తదితర ఆలయాలకు చెందిన భూమలను ఏడాది పాటు సాగు చేసుకునేందుకు గ్రామస్తులు, పెద్దలు, అర్చకులు సమక్షంలో వేలంపాట నిర్వహించామన్నారు. మొలగవెల్లి గ్రామంలో సర్వే నంబర్ 742 లోని 11.83 ఎకరాల మెట్టభూమిని రూ.80 వేలకు దాసరి రంగముని, సర్వే నంబర్ 7లోని 23.47 ఎకరాలను రూ.1,05,000లకు ఓంకార, 1150 సర్వే నంబర్‌లోని 47.67 ఎకరాలను రూ.1,80,000లకు గోపాల్, 640 సర్వే నంబర్‌లోని 7 ఎకరాల భూమిని దాసరి రంగమ్మ రూ.68 వేలకు, అలాగే 927 సర్వే నంబర్‌లోని 14.37 ఎకరాలను రూ.68 వేలకు, 899 సర్వే నంబర్‌లోని 15.08 ఎకరాల భూమిని సి.మానిక్ రూ.80 వేలకు దక్కించుకున్నట్లు వివరించారు. వేలం పాటలో పాడిన మొత్తం రూ.5,81,000 నిర్దేశిత గడువులోగా ప్రభుత్వ ఖజానాకు చెల్లించేలా అగ్రిమెంట్ కుదుర్చుకోవడం జరిగిందని ఈఓ వెల్లడించారు.

చర్చిలో చోరీ

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఉన్న ఇంటింటి సువార్త ప్రార్థనా మందిరంలో చోరీ జరిగినట్లు సంఘపెద్దలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ చర్చిలో ఉన్న సుమారు 11 వేల విలువ గల సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించరాని తెలిపారు.

మెట్టభూముల్లో జలసిరులు

- వైఎస్సార్ జలకళ పథకంతో బోర్ల తవ్వకాలు
- మండలంలో 60 మంది లబ్ధిదారులు
- 35 బోర్లకు మోటార్, పంప్‌సెట్ ఏర్పాటు
- ఏడాదికి మూడు పంటలు పండించుకునే అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



దేవనకొండలో నారాయణమ్మ పొలంలో వైఎస్సార్ జలకళ కింద వేసిన బోరు, వెలమకూరులో శివయ్య పొలంలో వేసిన బోరు నుంచి వస్తున్న నీరు

దేవనకొండ: అసలే రాయలసీమలోని కరువు ప్రాంతం.. వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే పంటలు.. లేదంటే వలసలు.. అలాంటి కరువు నేలల్లో జలకళ పథకం సిరులు కురిపిస్తోంది. మెట్ట భూముల్లో జలధారలు ఉప్పొంగుతూ రైతుల కుటుంబాల్లో ఆనందం నింపుతున్నాయి. ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ జలకళ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. కనిష్టంగా 2.5 ఎకరాల నుంచి గరిష్టంగా 5 ఎకరాల్లోపు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేసి మెట్ట భూములకు సాగునీరు అందిస్తున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. జలకళ పథకం ద్వారా ఒక్కో రైతుకు సగటున రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు వరకు ప్రయోజనం కలుగుతోంది.

బోర్లకు విద్యుత్ మోటార్ల ఏర్పాటు

వైఎస్సార్ జలకళ కింద మండలంలో 60 మంది లబ్ధిదారులకుగానూ 35 మందికి సంబంధించి బోర్లకు విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా బోర్లకు విద్యుత్ మోటార్లను సరఫరా చేస్తోంది. ఒక వైపు విద్యుత్ మోటార్ల సరఫరాకు ఎస్టిమేట్లు, జనరేట్ చేయడం. ఆయా జిల్లా కలెక్టర్ల నుంచి పరిపాలన అనుమతులు తీసుకోవడం, వర్క్ ఆర్డర్ జనరేట్ చేసుకొని వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టడం, మోటార్ల సరఫరా, అమర్చడం వంటి పనులకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు ముమ్మరం చేశారు. ఇప్పటికే 60 బోర్లకు విద్యుత్ మోటార్లు అమర్చేందుకు జిల్లా కలెక్టర్ అనుమతులు ఇచ్చారు.

గతంలో ఇలా..

బోర్ల తవ్వకం ఖరీదైన వ్యవహారం కావడంతో సన్న, చిన్నకారు రైతులు వర్షాధారంపై పంటలు సాగు చేసేవారు. కొందరు ధైర్యం చేసి బోర్లు తవ్వుకుని సరిగా నీరు పడక అప్పుల పాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. బోర్లు తవ్వుకున్న తర్వాత విద్యుత్ మోటారు, ఇతర మెటీరియల్ ఖర్చు తడిసిమోపెడయ్యేది. గతంలో టీడీపీ హయాంలో ఐదేళ్ల తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సరిగా పండలేదు. మెట్ట భూములు సైతం బీళ్లుగా దర్శనమిచ్చేవి.

ప్రస్తుతం ఇలా..

సన్న, చిన్నకారు రైతుల కలలు పండే విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తోంది. ఉచితంగా బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ మోటార్, ఇతర మెటీరియల్‌ను కూడా ఉచితంగానే అందజేస్తోంది. జలకళ బోర్లకు పంపుసెట్లు అమర్చడంతో రైతులు ఏడాదికి మూడు పంటలు పండించుకునే వెసులుబాటు లభించింది.

మోటార్ల ఏర్పాటుపై దృష్టి

వైఎస్సార్ జలకళ పథకం కింద తవ్విన బోర్లకు విద్యుత్ మోటార్లు అమర్చడంపై దృష్టి సారించాం. బోరులో నీరు ఉన్నప్పుడు మోటారు ఇస్తేనే రైతుకు మేలు జరుగుతుంది. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో మోటార్లు అమర్చే పనులకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 220 బోర్లకు విద్యుత్ మోటార్లు బిగించడం పూర్తయ్యింది. జిల్లా కలెక్టర్ ఇచ్చిన పరిపాలనా అనుమతుల మేరకు మిగతా వారికి త్వరగా మోటార్లు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– అమరనాథరెడ్డి, డ్వామా పీడీ, కర్నూలు

రూ.4 లక్షలు ఖర్చు చేసి బోరు వేశారు

మా పొలానికి నీటి సదుపాయం ఉండేది కాదు. కాల్వ దూరంగా ఉండడం వల్ల అతి కష్టం మీద వందలాది పైపులు పెట్టుకుని నీరు పారించుకుని పంటలు పండించే వాళ్లం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా పొలంలో బోరు వేయించింది. అలాగే బోరుకు విద్యుదీకరణ, విద్యుత్ మోటార్ తదితర వాటికి మొత్తం రూ.4 లక్షలకు పైగా ఖర్చు చేసింది. అంత ఖర్చు పెట్టుకుని బోరు వేయాలంటే మా వల్ల అయ్యేది కాదు. ఇప్పటివరకు సాగునీటి సదుపాయం లేక పంటలు కలిసిరాక నష్టాలు మూట కట్టుకున్నాం. ప్రభుత్వ సహకారంతో బోరు వేయడంతో నిండుగా నీరు వస్తున్నాయి. బోరు కింద మిర్చి పైరు సాగు చేశాం.

– దేవనకొండ నారాయణమ్మ

మోటారు కూడా ఉచితంగా ఇచ్చారు

మాకు మూడెకరాల భూమి ఉంది. రెండేళ్ల క్రితం వరకు వర్షాధారం కింద పంటలు సాగుచేస్తూ నష్టాలు మూట కట్టుకున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జలకళ పథకం కింద ఉచితంగా బోరు వేయించింది. అధికారులు వచ్చి బోరుకు మోటార్ బిగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా కలను నెరవేర్చారు. బోరు కింద ప్రస్తుతం మిర్చి సాగుచేశాం. పంట ఆశాజనకంగా ఉంది. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– శివయ్య, వెలమకూరు

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డాక్టర్ రవి

ఆలూరు రూరల్: డెంగీ నివారణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. ఆయన గురువారం మొలగవల్లి గ్రామంలో వైద్యారోగ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ సోకిన వారికి తీవ్రమైన జ్వరం, ఎముకలు, కండరాల్లో విపరీతమైన నొప్పి, వాంతులు, వికారం రక్తంతో కూడిన మలవిసర్జన అవుతుందన్నారు. డెంగీ జ్వరం ఆడ దోమకాటుతో వ్యాప్తి చెందుతుందన్నారు. నీరు నిల్వ ఉన్న చోట ఈ దోమలు పెరుగుతాయని చెప్పారు. ఇవి పగలు మాత్రమే కుడతాయని తెలిపారు. దోమల బారిన పడకుండా దోమ తెరలు వాడాలని సూచించారు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీహెచ్ఈఓ అంద్రూస్, సూపర్‌వైజర్ బాషా, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం, ఏఎన్ఎంలు రుక్మిణి, యశోద, ఆశాలు కళావతి,మల్లిక, సునీత పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

హాలహర్వి: ప్రజలు దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు తిమ్మయ్య, మన్సూర్‌వలీ సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని అర్ధగేరి, హాలహర్వి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలు వస్తాయన్నారు. రాత్రివేళల్లో దోమ తెరలను వాడాలని సూచించారు. చిన్న జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలుంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్, హెల్త్ సూపర్‌వైజర్లు మోహన్, ఆదినారాయణ, అబ్రహం, చిట్టి తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: దేవనకొండ, గోనెగండ్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైద్య సిబ్బదితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. మెడికల్ ఆఫీసర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయిబాబా డెంగీ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు రంగస్వామి, హనుమంతు, సుధాకర్, ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

మళ్లీ విజయం మనదే


పత్తికొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- మరోసారి ప్రభంజనం సృష్టించనున్న వైఎస్సార్‌సీపీ
- ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటా
- రెచ్చగొట్టే చర్యలకు స్పందించొద్దు
- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్ : 'మండుటెండలో నెలన్నరపాటు నా వెంట నడిచారు. ఎంతో ఆదరాభిమానాలు చూపారు. నా గెలుపు మీ విజయంగా భావించి ఎంతో కష్టపడ్డారు. మీకు రుణపడి ఉంటా' అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓటేసిన ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఓటింగ్ శాతం పెరిగేలా పార్టీ శ్రేణుల కృషిని అభినందించారు. పత్తికొండ నుంచి రెండోసారి పోటీ చేసే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తనకు అండగా నిలిచిన పార్టీ శ్రేణులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తోందని, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధించబోతోందన్నారు. వృద్ధులు, మహిళలు, యువత, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచారన్నారు. రాష్ట్రంలో మరోసారి ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు. జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని వైఎస్ జగన్ విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని జోస్యం చెప్పారు. పత్తికొండలో కూడా మరోసారి విజయం సాధించబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. సొంత డబ్బులు కూడా ఖర్చు చేసి తన విజయం కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలను ఎప్పటికీ మరువనన్నారు. ఓటమిని జీర్ణించుకోలేక టీడీపీ నేతలు అసహనంతో రెచ్చ గొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వాటికి ఎవరూ స్పందించవద్దని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ ఎస్ నాగరత్నమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, ఎంపీపీ నారాయణదాస్, మద్దికెర జెడ్పీటీసీ మురళీధరరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, తుగ్గలి మండల అధ్యక్షుడు జిట్టా నాగేష్ యాదవ్, నాయకులు సోమశేఖర్, భాస్కర్‌నాయక్, కారం నాగరాజు, రామచంద్రారెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

పరామర్శ..

తుగ్గలి : రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంపల్లికి చెందిన బొయిగడ్డ రమేష్ (20) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గురువారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు.ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బోగోలు నాగభూషణరెడ్డి, సర్పంచ్ మనీంద్ర ఉన్నారు.

హొళగుందలో తేలికపాటి వర్షం

హొళగుంద: మండల కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలలో గురువారం రాత్రి తేలికపాటి వర్షం కురిసింది. స్వల్పంగా ఈదురుగాలులకు తోడు ఉరుములు, మెరుపుల శబ్దాలతో కురిసిన వర్షానికి వీధుల్లో నీళ్లు పారాయి. ఈదురుగాలులతో కూడిన వర్షానికి హొళగుంద, సమ్మతగేరి క్యాంప్, హొన్నూరు కొట్టాల, సమ్మతగేరి తదితర గ్రామాల్లో సాగు చేసిన మామిడి తోటల్లో కాయలు నేలరాలి కొద్దిమేర నష్టం చేకూరింది. వేసవిలో కురిసిన వర్షంతో కొంతమేర ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం కలిగింది.

హాలహర్వి మండలంలో..

హాలహర్వి: మండలంలోని బిలేహాల్, విరుపాపురం, నిట్రవట్టి, సిద్ధాపురం గ్రామాల్లో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. తొలకరి చినుకులు పలకరించడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న సమయంలో తొలకరి జల్లులు ప్రజలకు ఉపశమనం కలిగించాయి. వర్షం కురవడంతో రైతన్నలు పొలాలను దుక్కి దున్నుకునే పనులకు సన్నద్ధమవుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గర్భస్రావం

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన రాంపురం లక్ష్మీ అనే నిండు చూలాలికి బైక్ అదుపుతప్పిన ప్రమాదంలో గర్భస్రావమైంది. కోసిగి వైద్యాధికారులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మి 9 నెలల నిండు గర్భిణి. ఆమె ప్రతి నెలా కోసిగి హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకునేదన్నారు. ప్రసవం నిమిత్తం పుట్టినిల్లు భూంపల్లి గ్రామానికి వెళ్లింది. ఆమెకు స్కానింగ్ పరీక్షలు చేయించేందుకు భర్త నాగరాజుతో కలిసి బైక్‌పై కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు వెళ్లారు. స్కానింగ్ పరీక్షలు చేసిన వైద్యులు తల్లీ, కడుపులో బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. అనంతరం తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో బైక్ అదుపుతప్పి కిందకు పడిపోయారు. లక్ష్మి తలకు గాయమై అపస్మారక స్థితిలో పడిపోయింది. వెంటనే ఆమెను రాయచూరు హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు పురిటిలోనే బిడ్డ మృతి చెందినట్లు గుర్తించారు. సిజేరియన్ చేసి మృతి చెందిన బిడ్డను బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మి కాసేపటికి తేరుకోవడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తల్లి గర్భంలోనే శిశువు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

నేత్రపర్వంగా ఆరాధనోత్సవాలు


ముద్దురంగా గురుస్వాముల వారికి పూజలు చేస్తున్న పీఠాధిపతి మఠం రంగప్పస్వామి


మూల విరాట్‌ను పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: మండల కేంద్రంలో వెలసిన ఘన గురు దత్తాత్రేయ సాంప్రదాయ వంశపరంపర గంజెళ్ల వెంకటాగురు శిష్యుడైన శ్రీముద్దురంగా గురువుల 139వ ఆరాధన మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. గంజెళ్ళ వెంకటాగురువుల వంశస్తులైన శ్రీ కృష్ణమూర్తి స్వామివారి ఆశీస్సులతో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పుణ్యగణారాధన కార్యక్రమంలో భాగంగా ముద్దురంగా గురువుల మూలవిరాట్‌ను పల్లకీలో ఉంచి పురవీధులగుండా వైభవంగా ఊరేగించారు. పల్లకీ ముందు నందికోలసేవ చేపట్టారు. మహిళలు సాంప్రదాయ దుస్తులతో కలశాలను చేతబట్టి ఊరేగింపులో పాల్గొన్నారు. నందికోలు సేవలో పీఠాధిపతులు, భక్తులు చేసిన నృత్యాలు చూపరులను అలరించాయి. రాత్రి గురువుల విచరణ ప్రవచనం, ప్రసాద, భోజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అఖండ భజన కార్యక్రమాలతో మేలుకొలుపు చేపట్టారు. కార్యక్రమంలో మఠం రంగప్పస్వామి, మఠం శాంతమూర్తిస్వామి, బ్రహ్మేంద్రస్వామి, ఆనందమూర్తిస్వామి, శ్రీనివాసులుస్వామి, గురుమూర్తిస్వామి మహిళలు, చిన్నారులు మరియు భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం


దాతలకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి గురువారం భక్తులు విరాళం అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం అయిజ పట్టణ వాస్తవ్యులైన విజయ్ కుమార్, శిరీష దంపతులు రూ.46,600లను ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, శేష వస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. ఆలయ పర్యవేక్షకుడు మల్లికార్జున, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ. 10వేలు అందజేస్తామని చెప్పారు. పాల్గొనే వారు ఉదయం 9 గంటలలోపు ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9398141138, 8978509384, 9703516043 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం


అమకతాడులో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలను వేదపండితులు ప్రారంభించారు. స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. రాత్రి 8 గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పెళ్లి పీటలపై ఆశీనులుగావించారు. భక్తుల సమక్షంలో గ్రామానికి చెందిన కోయిలకొండ వీరభద్రుడు, సుజాతమ్మ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి కల్యాణం జరిపించారు. 9 గంటలకు బండి ఆత్మకూరు మండలం, ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన గౌతమి బృందం బ్రహ్మంగారి నాటకాన్ని ప్రదర్శించారు.

తవ్వి వదిలేశారు


రోడ్డుపై మట్టి వేసిన దృశ్యం


రోడ్డు పక్కన గుంత తవ్వి వదిలేసిన దృశ్యం

మద్దికెర : మండలంలోని ఎడవలి– బొమ్మనపల్లి గ్రామాల మధ్య పైపులైను వేయడానికి గుంతులు తవ్వి వదిలేయడంతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తుగ్గలి మండలంలోని జొన్నగిరి వద్దనున్న బంగారు గనుల పనులకు ప్రైవేట్ కంపెనీకి అవసరమైన నీటి కోసం ఎడవలి వద్ద హంద్రీనీవా కాలువ నుంచి నీటిని తరలించడానికి పైపులైను వేసేందుకు గుంతలు తవ్వారు. తవ్వి రెండు నెలలవుతున్నా సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పైపులైను పనులు పూర్తి చేసి గుంతలు పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

ఊపందుకున్న వ్యవసాయ పనులు


బాపనదొడ్డి సమీపంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నుతున్న దృశ్యం

కృష్ణగిరి: మండలంలో నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి పల్లెల్లో వేసవి దుక్కులు ఊపందుకున్నాయి. గత ఖరీఫ్, రబీల్లో సాగు చేసిన పంటల వ్యర్థాలను తొలగిస్తున్నారు. తొలగించిన పొలాల్లో ట్రాక్టర్లు, ఎద్దులతో దుక్కులు దున్నుదున్నారు. సరైన సమయంలో వర్షం రావడంతో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. మరో 20 రోజుల్లో ప్రారంభం కానున్న ఖరీఫ్‌కు పొలాలను సిద్ధం చేసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు.